# 7

# దేవుని కట్టడము

> "ప్రతి కట్టడమును ఆయనలో చక్కగా అమర్చబడి, ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయమగుటకు వృద్ధిపొందుచున్నది. ఆయనలో మీరు కూడ ఆత్మమూలముగా దేవునికి నివాసస్థలమై యుండుటకు కట్టబడుచున్నారు" (ఎఫెసీ. 2:21, 22).

పాత నిబంధన కాలంలో కట్టడ సాహసంలో అత్యున్నతమైనది సొలొమోనుయొక్క యెహోవా మందిర నిర్మాణ కార్యమైయుంటుంది. "యెహోవా మందిరం" యొక్క నిర్మాణాన్ని గూర్చిన ఉద్దేశం తొలుత దావీదుచేత వ్యక్తపరచబడింది. దావీదు అధికంగా యుద్ధాలు జరిగించినవాడయ్యున్న కారణాన (2 సమూ. 7:5; 1 దినవృ. 28:3) ఆలయ నిర్మాణ కార్యక్రమం సొలొమోనుకు యివ్వబడుతుందని నాతాను ద్వారా దేవుడు దావీదుకు తెలియజేశాడు. తన మరణానికి ముందు దేవాలయానికి సంబంధించిన వస్తువులను సమకూర్చడానికి దేవుడు అతనికి అనుమతినిచ్చాడు.

సొలొమోనుయొక్క నాయకత్వంలో, అత్యున్నతమైన భద్రతతోను, పనితనంతోను, అతి శ్రేష్ఠమైన సామాగ్రితోను దేవాలయం నిర్మించబడింది. రాతితో కట్టబడినా దేవదారు మ్రానులతో చుట్టు చట్రంగా బిగించబడి బంగారు రేకుతో తాపబడింది. అది ప్రత్యక్ష గుడారానికి రెండతలు ఉంటుంది (1 రాజులు 5:1–9:9; 2 దినవృ. 2–7), ఆ నిర్మాణ కార్యక్రమం పూర్తియవ్వడానికి ఏడున్నర సంవత్సరాలు పట్టింది. మోరీయ కొండమీద కట్టబడింది, అబ్రాహాము ఇస్సాకును అర్పించబోయిన స్థలానికి అది సమీపంగా కట్టబడియుండవచ్చు.

పదివేలమంది[1] ఇశ్రాయేలీయులు దేవాలయ నిర్మాణ కార్యక్రమంలో పనిపెట్టబడ్డారు (1 రాజులు 5:13, 14) మరియు లక్ష యాభైవేలమంది ఇశ్రాయేలీయులు కానివారు కూలీలుగా ఉపయోగింపబడ్డారు (1 రాజులు 5:15; 2 దినవృ. 8:7–10). ఈ ఇశ్రాయేలీయులు కానివారు యుద్ధ ఖైదీలుగాని, అమ్మబడినవారుగాని, లేక ఇంట పుట్టిన దాసులుగాని అయ్యుండవచ్చు. వారు రెండు గుంపులుగా విభాగింపబడ్డారు – డెభైవేల మంది బరువులు మోసేవారు, ఎనభైవేలమంది రాళ్లు మలిచే పనివారు. ఈ పనివారందరిమీద పై విచారణ చేసేవారు 3,850 మంది.[2] మరో మాటల్లో చెప్పాలంటే, 1,63,850 మంది ఎడతెగకుండ పని జరిగించారన్న మాట. పనివారియొక్కయు, పై విచారణ చేయువారియొక్కయు ఈ బ్రహ్మాండమైన సంఖ్య, ఆ దేవాలయ నిర్మాణ కార్యక్రమం ఎంత అత్యధికమైనదో సూచిస్తుంది.

లేఖనాల్లో దాఖలు చేయబడిన బహు రమ్యమైన ప్రార్థనలలో, దేవాలయ ప్రతిష్ఠ సమయంలో సొలొమోను చేసిన ప్రార్థన ఒకటి (2 దినవృ. 6:3–42). ప్రార్థనాంతమందు

అతడు 22,000 ఎడ్లను, 1,20,000 గొర్రెలను బలిగా అర్పించాడు (1 రాజులు 8:62, 63; 2 దినవృ. 7:4, 5). దినవృత్తాంతముల లేఖికుడు యిలా అన్నాడు, "సొలొమోను తాను చేయు ప్రార్థనను ముగించినప్పుడు అగ్ని ఆకాశమునుండి దిగి దహనబలులను ఇతరమైన బలులను దహించెను; యెహోవా తేజస్సు మందిరము నిండ నిండెను. యెహోవా తేజస్సుతో మందిరము నిండినందున యాజకులు అందులో ప్రవేశింపలేకయుండిరి" (2 దినవృ. 7:1, 2).

క్రీ.పూ. 586లో నెబుకద్నెజరు దాని నాశనం చేసేవరకు ఇశ్రాయేలు జనాంగానికి దేవాలయం అపారమయిన యెహోవా మందిరంగా నిలిచియుంది.

దేవునికొరకు ఎన్నడూ కట్టబడనంత అతి గొప్పదైన కట్టడం పాత నిబంధనలో కట్టబడిందని తేలికగా ఆలోచింపవచ్చును, గాని అది వాస్తవం కాదు. దేవునికొరకు ప్రభువైన యేసు దానికి మించిన ఎంతో ఘనమైన కట్టడాన్ని కట్టాడు. క్రొత్త నిబంధనచేత అది "సంఘము" అని పిలువబడింది, మరియు అది – అత్యంత ప్రత్యేకమైనదియు మహిమాయుక్తమైన కట్టడమైయుంది.

క్రీస్తుకు వెలుపల ఉండడం, క్రైస్తవుడవైయుండడం అనే దానికి మధ్యగల తీవ్రమైన వ్యత్యాసాన్ని క్రొత్త నిబంధన యంతటిలో ఎఫెసీ. 2లో పౌలు చూపాడు. "మునుపు – మరియు – తరువాత" అనే రూప చిత్రంలో అతడు ఆ వ్యత్యాసాన్ని వర్ణించాడు. ఉదాహరణకు, ఒకడు క్రైస్తవుడు కాక మునుపు అతడు చచ్చినవాడై యున్నాడని పౌలు తెలిపాడు. అపవాదియొక్క అధికారం క్రింద, ఈ లోక మర్యాదను అనుసరిస్తూ అవిధేయునివలె నడుచుకొంటున్నాడని పౌలు తెలియజేశాడు (ఎఫెసీ. 2:1–3). క్రైస్తవుడైన తరువాత, అతడు క్షమించబడ్డాడు. అతడు క్రీస్తులో ఉన్నవాడై, కృప ద్వారా రక్షింపబడ్డాడు (ఎఫెసీ. 2:4–10) అని పౌలు వివరించాడు. ఈ తారతమ్యాన్ని అతడు సూచించాడు. అలా చేయడంలో, సంఘానికి అతడు మూడు చిత్రాలను వినియోగించాడు: పట్టణం (2:19), కుటుంబం (2:19), మరియు కట్టడం అనేవి (2:20, 21). సంఘమును గూర్చి పరిశుద్ధాత్మ మనకు యిచ్చిన వర్ణనలలో సంఘము దేవుని కట్టడమనేది బహు రమ్యమైన వర్ణనయైయుంది.

> కాబట్టి మీరికమీదట పరజనులును పరదేశులునై యుండక, పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును దేవుని యింటివారునై యున్నారు. క్రీస్తు యేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాదిమీద మీరు కట్టబడియున్నారు. ప్రతి కట్టడమును ఆయనలో చక్కగా అమర్చబడి, ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయమగుటకు వృద్ధిపొందుచున్నది. ఆయనలో మీరు కూడ ఆత్మమూలముగా దేవునికి నివాసస్థలమై యుండుటకు కట్టబడుచున్నారు (ఎఫెసీ. 2:19–22).

చిత్రరూపంగా, అలంకారపు భాషలో, దేవుని సంఘాన్ని పరిశుద్ధాత్మ కట్టడం అని పిలిచాడు. ఈ అలంకార రూపంలో సంఘాన్ని మనం చూస్తూ, దాని ప్రత్యేకింపబడిన స్వభావాన్ని గూర్చి మనం జ్ఞాపకం చేయబడ్డాం.

## ఒక "మానవ" కట్టడం

పాత నిబంధనలో దేవాలయంవలె కాక, "సంఘం" అనే దేవుని క్రొత్త నిబంధన (భవనం) కట్టడం, మనుష్యులతో కట్టబడింది. ఈ కట్టడానికి కావలసిన మెటీరియల్ ప్రతి క్రైస్తవుడై యున్నాడు. వానితో యిది నిర్మించబడుతుంది.

క్రైస్తవులైన అన్యజనులు యికమీదట పరజనులు పరదేశులు కారని, పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును దేవుని యింటివారునై, అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాది మీద కట్టబడిన కుటుంబమును, దానికి క్రీస్తుయేసే ముఖ్యమైన మూలరాయిగా ఉన్నట్టు పౌలు తెలియజేశాడు. వారు గతంలో, యూదులైనా, అన్యజనులైనా – క్రైస్తవులుగా వారు దేవుని కట్టడంలో అతుకబడ్డారని అతడు అన్నాడు. 1 పేతురు 2:5లో పేతురు అలాటి పోలికనే సూచించాడు: "యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మసంబంధమైన బలులనర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు, మీరును సజీవమైన రాళ్లవలె నుండి ఆత్మసంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు."

సంఘము ఒక కట్టడం, అయితే అది క్రైస్తవులుగా మారినవారితో కూడిన ఆత్మసంబంధమైన కట్టడమైయుంది. ఆ కట్టడంలో ప్రతి క్రైస్తవుడు ఆత్మసంబంధమైన ఒక రాయియైయున్నాడు. క్రైస్తవులందరు, సజీవమైన రాళ్లవలె ఉండి, అలంకారంగా ఒక కట్టడానికి పోల్చబడిన కన్పించే, చురుకైన, ఆత్మసంబంధమైన సంఘటిత శరీరంగా (ఆర్గానిజంగా) అతుకబడతారు లేక దేవుని ఆత్మచేత సిమెంట్ చేయబడతారు.

వందలకొలది చిన్న చిన్న సంస్థలన్నీ ఏకంగా కలిపి ఈ పెద్ద కట్టడమై ఉంటుందనేది పౌలు యొక్క రూపచిత్రం కాదు. సార్వత్రిక సంఘము లోకంలోని మత శాఖలన్నిటితో రూపింపబడినట్టు క్రొత్త నిబంధన వర్ణించదు. క్రీస్తు సంఘంయొక్క ప్రతి స్థానిక సంఘము దానియందు అదే సంపూర్ణమైనదై సార్వత్రిక సంఘాన్ని స్థానికంగా ప్రదర్శిస్తూ ఉంటుంది.[3] వ్యక్తిగతమైన క్రైస్తవులతో లోకమందంతట ఉన్న సార్వత్రిక సంఘము చేయబడినదై, సంఘమనే ఆత్మసంబంధమైన ఈ కట్టడంలో ప్రతి ఒక్కరు సజీవమైన రాళ్లగా సేవచేస్తారు.

సంఘాన్ని భౌతికమైన కట్టడంగాగాని, లేక ఆరాధనా స్థలమని కాని భావించకూడదు. సంఘ కట్టడాలను గురించి క్రొత్త నిబంధనలో ఒక గీతైనా లేదు. ఆరాధనకొరకు క్రైస్తవులు క్రమంగా కూడవలసిందిగా ఆజ్ఞాపించబడ్డారు (హెబ్రీ. 10:25), మరియు ఆ ఆజ్ఞలో కూడడానికి ఒక స్థలం గుప్తం చేయబడింది గాని; యిలాటిది యితర సంగతులతోపాటు, ఒక యిల్లు అయ్యుండవచ్చు, లేదా బహిరంగమైన స్థలమైయుండవచ్చు, లేదా ఆ పనికొరకు డిజైన్ చేయబడిన ఒక (బిల్డింగ్) కట్టడం కూడా అయ్యుండవచ్చు, ఆరాధనా స్థలాన్ని గూర్చి క్రొత్త నిబంధనలో వివరంతో కూడిన ఏ ఆజ్ఞలు యివ్వబడలేదు. ప్రతి సమాజంలో ఉన్న క్రైస్తవులయొక్క తీర్మానానికి వారి యిష్టాయిష్టాలకు విడిచిపెట్టబడింది. వారు క్రమంగా కూడడానికిగాను ఒక కట్టడం కట్టుకోగోరవచ్చు లేదా యింటిలోనో లేక బహిరంగమైన స్థలంలోనో కూడుకొనవచ్చు. సంఘము దేవుని కట్టడమని మాత్రం మనం జ్ఞాపకం ఉంచుకోవాలి, అది ఆ స్థలంలోని క్రైస్తవులే, కాని వారు ఆరాధనకు కూడే స్థలం మాత్రం కాదు.

క్రైస్తవులు తమ్మును తాము దేవుని యింటిగాను, ప్రతి క్రైస్తవుడును ఆ యింటిలో ప్రముఖమైన భాగంగాను తన్ను తాను చూచుకోవాలనేది పౌలు యొక్క సందేశమైయుంది. క్రైస్తవుడు రోడ్డు మీద నడిచిపోతుంటే, "సంఘమనే దేవుని కట్టడంలో సజీవమైన రాయి వెళ్లుతుంది" అని చూచేవాడు చెప్పగలిగినట్టుండాలి.

క్రైస్తవులవలన దేవుని సంఘాన్ని లోకం తీర్పు తీర్చుతుంది గాని, క్రైస్తవులు ఆరాధించే స్థలాన్నిబట్టిగాని, లేక వారి బిల్డింగ్‌ను బట్టిగాని కాదు. క్రీస్తు సంఘములో మన స్థితికి అనుగుణ్యంగా జీవించుతూ, దేవుని కట్టడంగా మనం జీవించేలా నిశ్చయం చేసికొందాం.

## "సజీవమైన" కట్టడం

సంఘము "మనుష్యులతో" నిర్మాణమైన కట్టడం అనే వాస్తవం, సంఘము "సజీవమైన" కట్టడమనేదాన్ని తేటపర్చుతోంది. పాత నిబంధనలోని సొలొమోను దేవాలయం, దేవదారు మ్రానులు, బంగారం, వెండి, మరియు దంతమువంటి నిర్జీవమైన వస్తువులతో నిర్మింపబడింది గాని, నేడు దేవుని కట్టడము సజీవమైన రాళ్లతో నిర్మింపబడింది.

పౌలు సంఘాన్ని ఎన్నడు ఒక సంస్థగా సూచింపలేదు. ఉదాహరణకు, మనముందున్న లేఖన భాగంలో సంఘమనేది (ఆర్గానిజం) సంఘటిత శరీరం, క్రైస్తవులతో నిర్మింపబడిన ఆత్మసంబంధమైన కట్టడమని, సజీవంగా ఉండి ఎదుగుతూ ఉండే – మ్రోగెడు స్థూల వస్తువు, అది కేవలం అందరికి సంబంధించిన అభిలాషలుగల జనుల సముదాయం కాదు.

పౌలు మాట్లాడుతున్న కట్టడానికి పై కప్పులేదు. దానికి పునాది, మరియు గోడలు మాత్రమే ఉన్నాయి కాని పై కప్పులేదు. క్రీస్తుయేసు ముఖ్యమైన మూల రాయియైయుండగా అపొస్తలులును ప్రవక్తలును పునాదులై ఉండగా, క్రైస్తవులు గోడలుగా కట్టబడుతున్నారు. క్రీస్తు, మూలరాయిగా కట్టడమంతటిని బంధించియుంచుతాడు. ప్రభువువైపుకు జనులు మారినప్పుడు, ఆ కట్టడం యొక్క గోడలకు వారు చేర్చబడతారు; యిది నిజమై యున్నందున, క్రొత్తగా క్రైస్తవులు జన్మించిన ప్రతిసారి ఆ కట్టడం అంతకంతకు ఎక్కువగా ఎదిగిపోతూ ఉంటుంది. ఎఫెసీ. 2:21లో ఉపయోగింపబడిన "వృద్ధిపొందుచున్నది" అనే పదం క్రొత్త నిబంధనలో ఎఫెసీ. 4:16లో మాత్రమే ఉపయోగింపబడింది. శరీరంలోని ప్రతి అవయవము ఒకదానితో నొకటి అతుకబడి సర్వ శరీరమునకు వృద్ధి కలుగజేసికొనుచున్నది అని సూచించడానికి యిది ఉపయోగింపబడింది.

అపొ. 2లోని సంఘాన్ని గూర్చి లూకా యిలా వ్రాశాడు: "కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి; ఆ దినమందు ఇంచుమించు మూడువేలమంది చేర్చబడిరి" (41 వ.). రెండు అధ్యాయాల తరువాత అతడిలా అన్నాడు, "వాక్యము వినినవారిలో అనేకులు నమ్మిరి. వారిలో పురుషుల సంఖ్య యించుమించు అయిదు వేలు ఆయెను" (అపొ. 4:4). కొద్ది కాలంలోనే, దేవునియొక్క కట్టడం మూడు వేల సజీవమైన రాళ్లయొద్దనుండి అయిదు వేలవరకు ఎదిగింది. అప్పటినుండి నేటివరకున్న

మధ్యకాలంలో దేవుని కట్టడం ఎదుగుతునే ఉంది. గత సంవత్సరం ఉన్నదానికంటె అది యిప్పుడు పెద్దదిగా ఉంది. ప్రభువైన యేసు తిరిగి వచ్చేవరకు అది ఎదుగుతునే ఉంటుంది.

---

సంఘము కట్టడమే, కాని అది ఆత్మసంబంధమైన కట్టడమైయుండి క్రైస్తవులుగా మారిన జనులతో కట్టబడుతోంది.

---

క్రైస్తవులను పేతురు "సజీవమైన రాళ్లు"గా సూచించాడు (1 పేతురు 2:5), మరియు పౌలు వారిని "సజీవ యాగము" అని పిలిచాడు (రోమా 12:1). నిశ్చయంగా, దేవునియొక్క ఈ కట్టడాన్ని గూర్చి ప్రతిదీ సజీవమైనదే. లేఖనాల్లో, తండ్రియైన దేవుని గూర్చి "జీవముగల దేవుడు" అని పిలువబడ్డాడు (1 థెస్స. 1:9). బైబిలు, "సజీవమై బలముగలదై" యుంది (హెబ్రీ. 4:12). పేతురు ప్రకారం, ప్రభువైన యేసు "సజీవమైన రాయి" (1 పేతురు 2:4). క్రైస్తవులు కలిగియున్న నిరీక్షణ నిజమైనది, అధికార పూర్వకమయ్యింది; తత్ ఫలితంగా, అది "జీవముతోకూడిన నిరీక్షణ" (1 పేతురు 1:3). క్రీస్తుకు తాము కనుపరచిన విధేయతనుబట్టి క్రైస్తవులు "జీవముగల ... మార్గమున" ప్రవేశించారు (హెబ్రీ. 10:20). యేసు, నిత్య క్రీస్తుగాను, మన మధ్యవర్తిగాను, "నిరంతరం" మనకొరకు విజ్ఞాపనము చేయుటకు నిలిచియున్నాడు (హెబ్రీ. 7:25). క్రీస్తులో ఉన్న మన జీవాన్ని మరణం సహా తీసివేయలేదని మనకు వాగ్దానం చేయబడింది. మనం ఆయనయందు విశ్వాసముంచితే, మనం చనిపోయినను మరల బ్రదుకుతాం (యోహాను 11:26).

క్రైస్తవుడు ఒక సంస్థయొక్క భాగమైయుండడు. సజీవంగా ఉండి, ఎదుగుతున్న ఆత్మసంబంధమైన యింటిలో అతడు సజీవమైన ఒక రాయియై ఉంటాడు. దేవుని కట్టడం యొక్క సౌందర్యానికిని అభివృద్ధికిని మనం అనుదినం తోడ్పడుతూ ఉంటాం. అభివృద్ధి కాకుండ ఎన్నడు ఆగిపోని యింటియందు యితర క్రైస్తవులతో మనం జతచేయబడ్డాం. మనం ఒక ఆత్మను క్రీస్తు వద్దకు నడిపించినప్పుడు, దేవుని యింటికి మరొక సజీవమైన రాతిని చేర్చుతాం. విపరీతంగా, మరొక క్రైస్తవుని మరి ఏ విధంగానైనా మనం నాశనం చేసినట్టయితే, దేవుని యింటనుండి ఒక సజీవమైన రాతిని తొలగిస్తున్నా మన్నమాట. ప్రతి క్రైస్తవుడు తక్కిన క్రైస్తవులందరితో జతచేయబడతాడు; మనం ఒకరితో ఒకరం, ఒకరికొకరం జీవించుతూ, అందరం కలిసి నివాసంగా రూపొందుతాం.

## "ఆత్మ-లోపల నివసించు" కట్టడం

ఇండ్లు నివాసానికి కట్టబడతాయి, దేవుని కట్టడానికి కూడా మినహాయింపు ఉండదు. ఆత్మసంబంధమైన ఆయన యిల్లు ఆయన ఆత్మచే నివసింపబడుతుంది.

"ప్రతి కట్టడము ఆయనలో చక్కగా అమర్చబడి పరిశుద్ధమైన దేవాలయమగుటకు

వృద్ధిపొందుచున్నది. అందులో మీరు కూడా ఆత్మమూలముగా దేవునికి నివాసస్థలమై యున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా?" అనికూడా పౌలు కొరింథీయులనడిగాడు (1 కొరింథీ. 3:16).

పరలోకంలో ఆయనకున్నట్టే భూమిమీదను దేవునికి నివాసస్థలముంది. భూమిమీద ఆయన నివాసస్థలం: సంఘము. ఆయన తన కుటుంబంతో ఆత్మ ద్వారా జీవించుచు కలిసికొంటూ ఉంటాడు. భూమిమీద సంఘము దేవునియొక్క దృశ్యమైన భాగమైయుంది; దేవుడు అనుదినం జీవించుతూ, సంఘమను తన కట్టడం ద్వారా ఆయన పని చేస్తాడు.

సొనోరా సమాజంలో, స్ప్రింగ్ డేల్, ఆర్కన్‌సాస్‌నుండి ఆరున్నర మైళ్ల దూరంలో ఉండే ఒక కర్షకుని నివాసమందు నేను పెరిగాను. మా యింటికి కొంచెం దూరంలో, ఒక కాలువ, దాని తరువాత ఒక పొలం దాటితే ఒక పాత యిల్లు వుంది. నేను పెదుగుతున్న దినాల్లో అది ఎక్కువ కాలం ఖాళీగా ఉండేది. దానిలో ముసలి దంపతులు ఉండేవారు, వారిలో ఒకరు (wheel chair) చక్రాల కుర్చీలో ఉండేవాడు. ఆ దంపతులను గూర్చి నాకు అంతగా జ్ఞాపకం లేదు, వారు ఆ పాత యింటిలో జీవించే దినాల్లో నేను చాలా పసివాడను. ఆ దంపతులు చనిపోయినప్పుడు, ఏదో ఒక కారణాన్నిబట్టి అది పడగొట్టబడేవరకు ఖాళీగానే ఉంది. అది చాలకాలం ఖాళీగా ఉన్న తరువాత ఆ పాత యింటిలోనికి నేనొకసారి వెళ్లిన జ్ఞాపకముంది. ఆ దంపతులు దాని విడిచి వెళ్లిపోగా, – ఫర్నిచర్, డిషెస్, బెడ్స్, యింకా యితర వస్తువులు ఎక్కడవి అక్కడే ఉండిపోయాయ్. దానిలోగుండా నేను నడిచేటప్పుడు నాకు ఒక రకమైన ఫీలింగ్ కలిగింది. కొంత కాలం ఖాళీగా ఉండగా, దుమ్ము, ముడుత, క్షీణదశ కంపుకొట్టింది. కొన్ని సంవత్సరాలకు ముందు దంపతులు దానిలో జీవించినట్టు, కార్యకలాపాలు జరిగించినట్టు ఆ యింటి నిండా పడియున్న న్యూస్ పేపర్స్, మేగజైన్స్‌తో మూగ స్వరాలు వినిపిస్తున్నాయి. ఆ యింటినిగూర్చి అలాటి (spooky feeling) స్పూకీ ఫీలింగ్ నాకు ఎందుకు వచ్చిందంటే, దానిలో నివసించే వారులేరు. అది ఒక షెల్, సామాగ్రితో నింపబడియు నివాసులులేని యిల్లు. కొంత ఖాళీగా ఉండి, నవ్వు, ప్రాణుల ప్రేమలేని ఇల్లు చూడడానికి ధారుణంగా ఉంటాయి. అవి సాధారణంగా ప్రకృతి దృశ్యంలోని కళంకములుగా రూపొందుతాయి.

సంఘము జన సంచారము లేనిదైతే, ఆ పాత యింటిలా, అది ఎంతగా అంటే అంతగా పనికిరానిదై యుంటుంది. ఏదియెలాగున్నా, నిజమైన సంఘము జీవము, బలములేని ఖాళీగా ఉన్న పాత జ్ఞాపక చిహ్నమై ఉండదు; అందు దేవుని ఆత్మ నివసిస్తాడు! లోకంలో దేవుని నివాసంకొరకు ప్రభువైన యేసు నిర్మించిన స్థలమది.

రోమా సామ్రాజ్యమంతటిలో విగ్రహ సంబంధమైన గుడులు ఉన్నాయి. ఆసియా అనబడే రాష్ట్రానికి దేవతయనబడే డయానా లేక అర్తమిదేవికి ఎఫెసులో చక్కగా అలంకరింపబడిన గుడి ఉంది. యూదా మతానికి యెరూషలేములో దేవాలయముంది, మరియు రోమా ప్రపంచమంతటిలో వెదజల్లబడినట్టు సమాజ మందిరాలు ఉండేవి. దేవుడు దానిని కొట్టివేసిన తరువాత కూడా అనేక సంవత్సరాలు దాని సభ్యులు మోషే ధర్మశాస్త్రాన్ని ఆచరిస్తునే ఉన్నారు. లోకంలోని దేవాలయాలు ఏవియెలాగున్నా, దేవుని యొక్క మందిరం బహు రమ్యమైనదియు, విస్తరించినదియునైయుంది. ఆయన

దేవాలయము హస్త కృతమైనది కాదు, కాని దేవునిచేతనే అది కట్టబడింది; మానవ నిర్మితమైన ఏ గుడికంటెను మహిమలోను, ఘనతలోను సాటిలేనిదై ప్రజ్వరిల్లుతోంది ఎందుకంటె దేవుడు తానే అందులో నివసిస్తాడు. క్రీస్తుయేసు ముఖ్యమైన మూల రాయియై ఉండగా అపొస్తలులు, ప్రవక్తలనే దైవికమైన పునాది మీద, దేవుడు ప్రతి సజీవమైన రాతిని, ప్రతి క్రొత్తగా జన్మించిన క్రైస్తవుని, ఒకదానిమీద ఒకటిగా నిలుపుతాడు. సజీవమైన రాళ్లన్నియు చక్కగా అమర్చబడునట్టుగా ఆ కట్టడంలోని గోడలలో ప్రతి ఒక్కటి దాని స్థానంలో నిలుపబడుతుంది. ఇండియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, అమెరికా, రష్యా, యూక్రేన్, ప్రపంచంలోని యితర ప్రాంతాలలో జనులు క్రీస్తులోనికి మార్పుచెందుతూ ఉండగా దానిమీద ఆయన అనుదినం కట్టుతునే ఉంటాడు. అప్పుడు, ఆత్మసంబంధమైన, అదృశ్యమైన, వృద్ధిచెందుతున్న దేవాలయంలో దేవుడు ఆత్మమూలంగా అందులో నివసిస్తాడు!

గొప్ప సవాలుతో ఈ సత్యం మన హృదయాలకు రావాలి. లోకంలో మనం దేవుని ఆలయమైయున్నాం! జ్ఞానంతోను, పరిశుద్ధాత్మతోను, విశ్వాసంతోను, విధేయతతోను మనం జీవించుదాం!

## ముగింపు

ఎఫెసీ. 2:19–22లో పౌలుచే గొప్ప మహిమాయుక్తమైన సత్యం ప్రకటింపబడింది: అది సంఘము దేవుని కట్టడమనేది. ఈ కట్టడం “మానవులతో కూడింది,” “సజీవ మయ్యింది,” “ఆత్మ అందులో నివసిస్తాడు.”

ధనవంతుడు దూరదేశం ప్రయాణమైపోతూ గొప్ప భవనాన్ని నిర్మించే కాంట్రాక్టర్‌కు అప్పగించినట్టు చెప్పబడింది. ఈ భవన నిర్మాణ కార్యక్రమంలో కాంట్రాక్టర్‌కు ఎక్కువ డబ్బు ధారాళంగా వాడడానికి యివ్వబడింది. ఆ నిర్మాణంయొక్క బాధ్యత పూర్తిగా అతని చేతికి అప్పగింపబడింది. ఆ నిర్మాణ సమయంలో బలమైన, వెలగల మెటీరియల్స్‌కు బదులుగా, చౌకరకం వస్తువులను వినియోగించి – వాటి ధరయొక్క వ్యత్యాసాన్ని తన జేబులో వేసికొంటూ వచ్చాడు. ఈ వ్యత్యాసాన్ని అతడు పట్టీలలో పూతలో, పెయింట్‌లో, ఇటుకలలో, అడుసులో, గోడల్లో, అంతస్థులలో ఈ రహస్యాన్ని దాచడానికి ప్రయత్నించాడు. ఓనర్ (సొంతగాడు) తిరిగి వచ్చాడు; ఇల్లు పూర్తి అయ్యింది, యిక ప్రవేశానికి సిద్ధంగా ఉంది. బయటనుండి చూస్తే మాత్రం, యిల్లు అదరగొడతుంది, ఓనర్ యొక్క ప్లాన్స్ ప్రకారం కట్టబడినట్టుంది, కాని మానవ కంటికి కనబడకుండ చాలిచాలనివి, చౌకరకం దూలాలేగాని, పైపులేగాని, టైల్స్‌గాని, సమస్త వస్తువులు ఆ కట్టడంలో యిమిడిపోయాయ్. “నీవు ఈ యింటిని నీ సొంతంగా ఉంచుకోవచ్చు!” అని ఓనర్ ఆ కాంట్రాక్టర్‌కు తాళాలు యిచ్చివేశాడట. అప్పుడు ఆ కాంట్రాక్టర్ ఎంత ఆశ్చర్యంగాను, నిరాశతోను కూలిపోయి ఉంటాడో. ఓనర్‌ను మోసగించడంలో కాంట్రాక్టర్ తన్ను తానే మోసగించుకున్నాడు.

ఇల్లు కట్టుమని మనం ఆదేశింపబడలేదు – మనం యిల్లుగా కట్టబడాలని ఆజ్ఞాపించ

బద్దాం! మనం ఏదో ఒక యిల్లు అయ్యుండకూడదు, కాని దేవుని యిల్లే అయ్యుండాలి. క్రీస్తులోనికి రాకుండ తప్పిపోయినట్టయితే, సజీవమైన రాళ్లవలె దేవుని యింటిలో భాగమైయుండునట్టు మానవునికి దేవుడు ప్రసాదించిన మహా భాగ్యం విషయంలో మనలను మనం మోసం చేసికొన్నట్టే. మనం దేవుని యింటిలో ప్రవేశించి, దేవుడు క్రైస్తవ జీవితంకొరకు రూపించిన విధానంలో కాకుండ చాలని జీవితాన్ని మనం జీవిస్తున్నట్టయితే, మనలను మనమే మరొకసారి మోసగించుకున్న వారమౌతాం. ఆయన నివాసయోగ్యమైన స్థలంగా కాకుండ అల్పంగా జీవించితే, అతి శ్రేష్ఠమైన అవకాశాలను మనం పాడుచేసికొంటూ ఉన్నాం.

సొలొమోనువలె మనం దేవునికొరకు బిల్డింగ్ కట్టలేం, దేవుని వాక్యం ద్వారా దేవుని ఆత్మచేత సంఘం నిర్మింపబడుతోంది గనుక. ఏదియెలాగున్నా, సువార్తకు లోబడడం ద్వారాను, క్రీస్తు ముఖ్యమైన మూలరాయియై ఉండగా, "సజీవమైన రాళ్లవలె" ఆయనమీద దేవుని మందిరముగా కట్టబడడానికి తగినవారమైయుందాం!

దేవుని కట్టడంలో నీవు భాగమైయున్నావా?

## స్టడీ మరియు చర్చకొరకైన ప్రశ్నలు

1. సొలొమోను కట్టిన దేవాలయాన్ని వర్ణించుము.
2. ఎఫెసీ. 2ను ఉపయోగించి, క్రైస్తవులకు క్రైస్తవేతరులకు మధ్యగల వ్యత్యాసాన్ని చర్చించు.
3. ఎఫెసీ. 2:20, 21ల్లో సంఘంయొక్క ఏకత్వాన్ని ఏ మూడు రూపాలుగా పౌలు చిత్రించాడు?
4. నేడు దేవుని ఆలయం "మానవులతో కట్టబడిన" కట్టడం ఎలాగో చర్చించు.
5. "సజీవమైన రాళ్లు" అనే ప్రయోగం – సంఘాలకు చెందుతుందా లేక వ్యక్తిగతమైన క్రైస్తవులకా?
6. భౌతికమైన చర్చి బిల్డింగులను గూర్చి క్రొత్త నిబంధన ఎంత సమాచారం అందించింది?
7. దేవునియొక్క ఆరాధనకును, ఆయనకు మనం చేసే సేవకును చర్చ్ బిల్డింగ్ యొక్క స్థానాన్ని చర్చించు.
8. సంఘము ఏ విధంగా "సజీవమైన" కట్టడమై యుంటుంది?
9. సంఘానికి పునాది మరియు గోడలు మాత్రమే ఉన్నాయి కాని పైకప్పు ఎలా లేదో వివరించు.
10. సంఘము వృద్ధిచెందే మార్గాలను పేర్కొనుము.
11. "ఆత్మచే నివాసం చేయబడడం" అనే ప్రయోగం యొక్క భావాన్ని వివరించు.
12. సంఘాన్ని విగ్రహాలయాలతో పోల్చి, దేవుని ఆత్మచేసే వ్యత్యాసాన్ని సూచించు.
13. ఇల్లు కట్టడానికి ఆజ్ఞాపించబడడం, ఇల్లుగా కట్టబడడం మధ్యనున్న వ్యత్యాసాన్ని చర్చించు.

## సూచనలు

[1]ముప్పైవేల మంది వెట్టి పనులు చేసేవారుగా నియమింపబడ్డారు, అయితే ప్రతి నెల పదివేల మందిని మాత్రమే ఉపయోగించారు. ఈ విధంగా వెట్టి పనులు చేసేవారు మూడు నెలలకు ఒక నెల పని చేస్తూ ఉండేవారు (1 రాజులు 5:13). [2]2 దినవృ. 2:18, 3,600 మంది కనాను అధిపతులను సూచిస్తుంది. 2 దినవృ. 8:10 రెండువందల ఏబది మంది (250) ఇశ్రాయేలు అధిపతులనిస్తుంది. ఇది మొత్తం 3,850 మంది పర్యావేక్షణ చేయు అధిపతులనిస్తుంది. 1 రాజులు 5:16. పనివారిమీద అధికారులు 3,300గా యిస్తుంది, 1 రాజులు 9:23 – 550 మంది పెద్ద అధికారులు. పర్యావేక్షణ చేయు అధిపతుల మొత్తం 3,850 ఔతుంది. ఈ విధంగా 1 రాజులు, 2 దినవృత్తాంతములు పర్యావేక్షణ చేయు అధిపతుల విషయంలో ఏకీభవిస్తున్నాయి. కాని వేరు కోణాల్లో వారిని సూపర్‌వైజర్స్‌గా అవి చూడవు. [3]F. F. Bruce, *The Epistle to the Ephesians* (Old Tappan, N.J.: Fleming H. Revell Co., 1961), 58.